క్లుప్తంగా

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన సివిల్స్ 104వ ర్యాంకర్ రావుల జయసింహారెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం బాధ్యులు ఆయన నివాసంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు భుజేందర్‌రెడ్డి, బాధ్యులు డాక్టర్ విజయపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఎన్‌పీడీసీఎల్ రిటైర్డ్ గణాంక అధికారి రవీందర్‌రెడ్డి, మల్లు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకుడు ఎస్.రామకృష్ణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. వరంగల్ జిల్లా పద్మకవుల్లో అల్లూరి రాజేశ్వరి కవి జీవితం, సాహిత్యం ప్రత్యేక అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో రామకృష్ణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

'ఆ ఎమ్మెల్సీలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయాలి'

హన్మకొండ: ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్ బీఆర్‌ఎస్‌ను వీడి తమతో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలంగాణ ఉద్యమకారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకొని అవినీతి, అప్పులపాలు చేసి ప్రజల ఆగ్రహానికి గురైన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో, బీఆర్‌ఎస్ పార్టీతో బడుగు, బలహీన వర్గాల నాయకులు తెగదెంపులు చేసుకోవాలన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి అధికారులు సహకరించాలి

కాజీపేట: నిలువ నీడలేని నిరుపేద కుటుంబాలకు కడిపికొండ గ్రామ శివారులో 46వ సర్వే నంబర్‌లో గతంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని బీజేపీ అర్బన్ జిల్లా నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రజలు సమాయత్తం అవుతుంటే కొంతమంది ఆ స్థలంలో ఇతర కట్టడాలకు దిగడం పేదలకు అన్యాయం చేయడమేనని వాపోయారు. దానిపై విచారణ జరిపించాలని గ్రేటర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించినట్లు రామలింగం తెలిపారు.

కడియంపై విమర్శలు సరికాదు



నయీంనగర్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల మహర్షి సూచించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీలో ఒక్క మాదిగలే కాకుండా ఇంకా 58 వరకు ఉపకులాలు ఉన్నాయని వారిని కూడా గుర్తించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంలో దళితులపై అనేక దాడులు జరిగాయని, దళితులను ఇప్పటికి గుళ్లల్లోకి రానివ్వని దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి మతతత్వ పార్టీ 3వ సారి అధికారంలోకి వస్తే దళితులు బతికే పరిస్థితి ఉండదని వాపోయారు. కాంగ్రెస్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రథయాత్ర చేస్తామని చెప్పారు. సమావేశంలో కిరణ్, సుకుమార్, పవన్, చరణ్ పాల్గొన్నారు.

'సుమతిరెడ్డి'లో సందడి

హసన్‌పర్తి: నగర శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు సందడి చేశారు. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీథమ్ -24 వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 'త్రియారి' బ్యాండ్ బృందం ప్రదర్శించిన ప్రదర్శన అదిరింది. తెలుగు, హిందీ పాటలు ఆహుతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ర్యాంప్ వాక్ చేశారు. నాటక ప్రదర్శనక ప్రదర్శనకు సభికుల మంచి స్పందన వచ్చింది. ముందుగా ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థినుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ పుష్పలత, డాక్టర్ ఎస్.శ్రీవాణి, రాము, అధ్యాపకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, ఏఓ వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'రియల్' దందా

- యథేచ్ఛగా అనధికార లేఔట్లు
- విలీన గ్రామాల్లో అక్రమ వెంచర్లు
- జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మామూళ్ల మత్తులో అధికారులు



బొల్లికుంట శివారులో వెలిసిన అక్రమ వెంచర్

ఖిలా వరంగల్: పచ్చని పొలాలు ప్లాట్లవుతున్నాయి. విలీన గ్రామాలు వెంచర్లకు ఆవాసాలవుతున్నాయి. రియల్ ఎస్టేట్ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలవుతోంది. రైతు మాత్రం బికారీగానే మిగిలిపోతున్నాడు. మండలంలోని పచ్చని వ్యవసాయ భూములు రియల్టర్ల చేతిలో బక్కచిక్కిపోతున్నాయి. ఎలాంటి అనుమతుల్లేకుండా వ్యవసాయేతర భూములుగా మారుతున్నా.. అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి నాలా రూపంలో అందాల్సిన ఆదాయానికి భారీ ఎత్తున గండి పడుతోంది. మరో వైపు అవగాహన లేక ఆ స్థలాలను కొనుగోలు చేసిన వారు పడరాని పాట్లు పడుతున్నారు. ఖిలా వరంగల్ మండలం విలీన గ్రామాలైన స్తంభంపెల్లి, వసంతపురం, దూపకుంట, గాడిపెల్లి, నక్కపెల్లి, బొల్లికుంట, ముస్కలపెల్లి, రామకిష్టాపురం, మామునూరు, తిమ్మాపురం, అల్లీపురం, జక్కలొద్ది, గ్రామాల్లో వందలాది ఏకరాల్లో అనధికార లేఔట్లు వెలిశాయి. రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. బొల్లికుంట గ్రామ పరిసరాల్లో మరింత ఎక్కువగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారం కొనసాగుతోంది. కల్లబొల్లి మాటలతో, చుట్టుపక్కల కంపెనీలు పడుతున్నాయని చెప్పి నగరవాసులను ఆకట్టుకుంటున్నారు.

పచ్చని పొలాల్లో అక్రమ వెంచర్లు

బొల్లికుంట పరిసరాల్లో పచ్చని పొలాలను వెంచర్లగా మార్చి విక్రయాలు మొదలెట్టారు. ఈ అక్రమ వెంచర్లపై అధికారులకు ఫిర్యాదులు చేసినా కూడా, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై నిలదీస్తే ప్లాట్ల అమ్మకాలు ప్రారంభమైన తర్వాతే నాలా, లేఔట్ అనుమతులు తెచ్చుకుంటామని కొనుగోలుదారులు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అక్రమ వెంచర్లపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు వాపోతున్నారు.

ఇవీ నిబంధనలు..

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే రెవెన్యూ నుంచి నాలా పర్మిషన్ తీసుకోవాలి. తర్వాత కుడా, నగరపాలక సంస్థ నుంచి లేఔట్ పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తంలో విలువలో 3 శాతం నాలాగా చాలానా రూపంలో చెల్లించాలి. మొత్తం భూమిలో పదిశాతం విస్తీర్ణాన్ని సామాజిక అవసరాలకు విడిచిపెట్టాలి. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం 30 అడుగుల వెడల్పుతో రోడ్లు వేయాలి. మురుగు కాల్వల వ్యవస్థ, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించిన తర్వాత ప్లాట్లు చేసి విక్రయించాలి. కానీ.. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ ధరకే వ్యవసాయ భూములు కొని ప్రభుత్వ నింబంధనలను తుంగలో తొక్కి వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయిస్తూ రూ.కోట్లల్లో సొమ్ము చేకుంటున్నారు.

కానరాని చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా లేఔట్లు వెలుస్తున్నా.. సంబంధిత అధికారులు వాటిపై నామమాత్రంగానే చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో రియల్టర్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. విషయం తెలియని కొందరు ఆ స్థలాలను కొన్న అనంతరం ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాక, బ్యాంకులు రుణాలివ్వక కొనుగోలుదారులు పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ లే ఔట్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇండియా కూటమితోనే న్యాయం



కాజీపేట: మాట్లాడుతున్న జ్యోతి

కాజీపేట: దేశంలో ప్రజాస్వామ్యం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నేదునూరి జ్యోతి సూచించారు. కాజీపేట 63వ డివిజన్ ఆరుట్ల రాంచంద్రారెడ్డి కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య గెలుపు కోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని కోరారు. సమావేశంలో దీన, మద్దెల ఏల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

న్యూశాయంపేట: పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీ ఓడించాలని, వామపక్ష, లౌకిక శక్తులకు బలపరిచి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో హనుమకొండ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చక్రపాణి అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికలు – కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై శుక్రవారం జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల ప్రజాసంఘాలను బీజేపీ నిర్బంధిస్తోందని వాపోయారు. ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీ లాంటి చట్టబద్ధమైన సంస్థలను తన స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుని దుర్వినియోగం చేస్తోందని వాపోయారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, నాయకులు పి.అశోక్, యాకయ్య, ఎల్లయ్య ప్రభాకర్, విజేందర్, చిరంజీవి, రామచందర్, సారయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి బ్లూప్రింట్ తయారు చేయాలి

హన్మకొండ: వరంగల్ మహానగర అభివృద్ధికి ప్రత్యేక బ్లూప్రింట్ తయారు చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరాన్ని కూడా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మామునూరు ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కాకతీయ విశ్వవిద్యాలయ ప్రక్షాళన, అండర్ గ్రౌండ్ డ్రెయినేజ్ నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. నియో మెట్రోరైల్ నిర్మాణం, రైల్వే డివిజన్ సాధన, భద్రకాళి కారిడార్, శిల్పారామం నిర్మాణం, కాకతీయ మ్యూజియం, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్, రెండవ రాజధాని ప్రతిపాదన, పేదలకు ఇళ్ల నిర్మాణం లాంటి వాటితో ఒక ప్రత్యేక బ్లూప్రింట్‌ను తయారు చేసి వరంగల్ నగరాన్ని దేశంలోనే ఒక ఉన్నత శ్రేణి నగరంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

మహిళా సంక్షేమానికి కేంద్రం పెద్దపీట



సమ్మేళనంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

హన్మకొండ: మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా శక్తి సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ముద్ర లోన్లు, స్వయం ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత వంటివి కల్పించిన ఏకైక ప్రధాని మోదీ అని గుర్తుచేశారు. బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుగుణరెడ్డి, నాయకులు గురుమూర్తి శివకుమార్, రత్నం సతీష్‌షా, రత్నలక్ష్మి, కల్యాణి, మంజుల రెడ్డి, శ్రీదేవి, అనిత, స్వాతి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

మడికొండ: 46వ డివిజన్ మడికొండ నుంచి పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో అరూరి రమేష్ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, 90వ బూత్ అధ్యక్షుడు దార ధనుంజయ్, నాయకుడు పొనగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్, కొలిపాక కుమార్‌బాబు, దుప్పెల్లి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

కాజీపేట: ఎంతోకాలంగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, పటిష్టత కోసం శ్రమిస్తున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు మున్సిపల్ పదవుల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చేలా అధిష్టానం దృష్టి సారించాలని కార్పొరేటర్ విజయశ్రీ సూచించారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు మిగిలిన పదవుల్లో కాజీపేట ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని దశాబ్దాలుగా కాజీపేటకు పదవుల పంపకంలో తగిన గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు. సీఎంతో పాటు జిల్లా మంత్రులు చొరవ చూపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

హన్మకొండ: ఎంబీఏ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కెనరా బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అభినవ్ గుప్తా సూచించారు. నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మంత్ర -2కే24 జాతీయ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ ఎంబీఏ పూర్తిచేసిన వారికి అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయని వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలతో కూడిన విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ సీహెచ్.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులంతా ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగి దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. ఎంబీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం, ఇతర రాష్ట్రాల నుంచి వివిధ ఎంబీఏ కళాశాలల నుంచి 300 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఎంబీఏ అధిపతి ఎస్.మహేందర్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్.వాహినీదేవి, ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, మంత్ర -2కే24 కన్వీనర్ పి.సుగుణాకర్ రెడ్డి, ఎంబీఏ అధ్యాపకులు రజిన్ కుమార్, కిశోర్, అనూష, ప్రేమ్‌కుమార్, కరుణ, సురేష్ చంద్ర, పి.అజిత్‌కుమార్, చంద్రకళ, శాంభవి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలిస్తేనే పార్లమెంట్‌లో తెలంగాణ గళం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సారయ్య

కాజీపేట రూరల్: బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తేనే పార్లమెంట్‌లో తెలంగాణ ప్రాంత సమస్యలు, అభివృద్ధి విషయంలో మాట్లాడే అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్‌తో కలిసి కాజీపేట 47, 48, 63వ డివిజన్లలో సారయ్య శుక్రవారం ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. సుధీర్‌కుమార్‌ను గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పార్లమెంట్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్, నాయకులు నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, మర్యాల కృష్ణ, బొల్లె కుమారస్వామి, దువ్వ కనకరాజు, తేలు సారంగపాణి, ఎండీ.అఫ్జల్, మిట్టపల్లి రవీందర్, బస్వ యాదగిరి, సిరిమల్ల దశరథం పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేద్దాం

ఖిలా వరంగల్: పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వరంగల్ గడ్డ మీద గులాబీ జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోటలో కార్పొరేటర్ పల్లం పద్మ నివాసంలో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీల నియామక సమావేశంలో సారయ్య మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు మరింత సమష్టిగా పనిచేయాలని కోరారు. అనంతరం బూత్ స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. మెట్టు శ్రీనివాస్, కార్పొటర్ పల్లం పద్మ, డివిజన్ నేతలు పల్లం రవి, పొగాకు సందీప్, మోడెం ప్రవీణ్, రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

వరంగల్ క్రైం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కుషినగర్ జిల్లా పరతవల్ గ్రామానికి చెందిన అభిమాన్యు (20) సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి హంటర్‌రోడ్డులోని రాజ్యలక్ష్మి గార్డెన్‌లోని గదిలో కరెంట్ వైర్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. హంటర్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి పెయింటింగ్ పనుల కోసం వచ్చిన అభిమాన్యు.. ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. మృతుడి బంధువు ఉమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మరో యువకుడు..

ఖిలా వరంగల్: గుర్తు తెలియని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ మధ్యకోటలోని ఉత్తర ద్వారం సమీపంలో రాతి కోటలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మధ్యకోట రాతికోట మెట్ల మార్గంలోని చెట్ల నీడన ఓ గుర్తు తెలియని 25 ఏళ్ల వయస్సు గల వ్యక్తి క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాధ్యులు

ఖిలా వరంగల్: నగర పరిసరాల్లో లారీల పార్కింగ్ కోసం రెండెకరాల భూమిని కేటాయించి లారీ ఓనర్ల సంక్షేమానికి కృషి చేయాలని ఎండీ.ఫిరోజ్ కోరారు. ఈమేరకు హైదారాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఫిరోజ్ మాట్లాడుతూ లారీ ఓనర్లు నిరంతరం ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్కింగ్ స్థలం లేక ప్రైవేట్ స్థలాల్లో పార్కింగ్‌కు రూ.వేలకు వేలు అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, 200ఫీట్ల రింగ్ రోడ్డు కింద ఇళ్ల స్థలాలు, భూములు కోల్పోతున్న బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుల్తానా అలీ, ముజాహిద్, గౌస్‌పాషా, సమీర్, అర్బత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై చైతన్య కార్యక్రమం



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న యోగా సంస్థ సాధకులు

కేయూ క్యాంపస్: 'మేము ఓటు వేయడమే కాకుండా.. మరో పదిమందితో కూడా ఓటేయిస్తాం' అంటూ బండారి అష్టాంగ యోగా సంస్థ సాధకులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు 30 రోజులపాటు నిర్వహించనున్న ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం కాకతీయ యూనివర్సిటీ మైదానంలో యోగా సాధకులు ఓటు ప్రాముఖ్యతను తెలిపే ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ అర్బన్ ప్రాంతాల్లో విద్యాధికులైన వారే ఎక్కువగా ఓటు వేసేందుకు నిరాసక్తత కనబరుస్తున్నారని వాపోయారు. అలాంటి వారికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. మే 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

ఖిలా వరంగల్: రంగశాయిపేట పరిధి బెస్తం చెరువు కట్టపై శుక్రవారం ఉదయం గంగమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వేద పండితుడు భాస్కరాచార్యులు, రుత్విక్కుల నేతృత్వంలో గంగమ్మ, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలిరాగా వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఉదయం 9గంటలకు స్థాపిత దేవతాయ జననం, 11.29 నిమిషాలకు గంగమ్మ తల్లి, పోతరాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన, శిఖర కలశ ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. అనంతరం విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కుంభం, దృష్టిస్థాపన గోదర్శనం, జయాదయ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం గంగపుత్ర ప్రతినిధులు మహాన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బైరి రామేశ్వర్, ఎలుగు సాంబేషం, ఎలుగు ఉపేందర్, స్థానికులు రాంబాబు, శ్రీధర్, శ్రీనివాస్ గుప్తా, రాజేశ్వర్‌రావు, విజయేందర్‌రెడ్డి కిషన్ రావు, రాము పాల్గొన్నారు.

దొడ్డిదారిన కాంగ్రెస్ పార్టీలో చేరారు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్

రామన్నపేట: తన సస్పెన్షన్‌కు బీఆర్‌ఎస్ రంగం సిద్ధం చేసిందనే విషయాన్ని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి గ్రహించి దొడ్డిదారిన కాంగ్రెస్‌లో చేరారని మాజీ కౌన్సిలర్ బుద్ద జగన్ విమర్శించారు. 29వ డివిజన్ రామన్నపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేయర్‌గా సుధారాణి డివిజన్‌కు చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. ఆమె రాకను నేతలు, నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసిన ఆమె రాకను స్థానిక ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడంతో జిల్లా నాయకుల సంబంధం లేకుండా చేరికల కమిటీ ద్వారా మేయర్ స్థానంలో ఉండి గుట్టుచప్పుడు కాకుండా చేరడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారే తప్ప, పార్టీ మీద కాని, ప్రజా సేవ చేయాలనే అభిమానంతో కాదని అన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు ఓరుగంటి పూర్ణ, బూత్ కన్వీనర్లు బొమ్మ సురేష్, గౌరె మహేష్, అరుణ్, శ్రీరాముల సురేష్, నల్లగొండ శ్రీనివాస్, మహిళా డివిజన్ అధ్యక్షురాలు కొలిపాక పద్మ, కందుకూరి అరుణ, గద్వాల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో 'ప్రైవేట్' తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

విద్యారణ్యపురి: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ నగరంలో వివిధ కోచింగ్‌ల పేరుతో వేసవిలో తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమళ, జిల్లా కమిటీ బాధ్యులు పురుషోత్తం, సాయికిరణ్, పృథ్వీరాజ్, సృజన్, జగదీశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీసీఎస్ కోఆప్షన్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



రాఘవేందర్‌ను సన్మానిస్తున్న రైల్వే నాయకులు

కాజీపేట రూరల్: సీసీఎస్ కోఆప్షన్ డైరెక్టర్‌గా దేవులపల్లి రాఘవేందర్ కాజీపేట రైల్వే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్) లిమిటెడ్ కార్యాలయంలో శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాజీపేట సీసీఎస్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో రాఘవేందర్ బాధ్యతలు స్వీకరించగా రైల్వే సీసీఎస్ డెలిగేట్స్, రైల్వే నాయకులు, కార్మికులు.. ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్స్ నాగరాజు, శ్యామ్, చీఫ్ ఓఎస్ అంజయ్య, రైల్వే నాయకులు జి.నాగరాజు, దేవిప్రసాద్, శివ, రాజు, కరుణాకర్, పి.రమేష్, సాయిరాజ్, గుర్రపు సుధాకర్, కోండ్ర నర్సింగరావు, పి.ప్రశాంత్, వి.నగేష్, ఎంకే.మూర్తి, చంద్రమోహన్, దేవదాసు, సుధాకర్, అహ్మద్, డి.రవీందర్, జి.రాజేశ్వర్‌రావు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు, గురువులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 2001 -2003వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని కేయూ సమీపంలోని ఓ బాంక్వెట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. వారంతా కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులు రిటైర్డ్ ప్రొఫెసర్లు శోభ, రాంరెడ్డి, గజ్జల రామేశ్వరాన్ని సన్మానించారు. డాక్టర్ కొమురయ్య, కుమార్, మహేందర్, సుమలత, డాక్టర్ మంద వీరస్వామి తదితరులున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శివాని' విజయకేతనం



పృథ్వీరాజ్



మనోజ్



అఖిల్



బన్ని



హర్విన్

హసన్‌పర్తి: జేఈఈ మెయిన్స్‌లో నగరంలోని తమ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. కె.పృథ్వీరాజ్ (316వ ర్యాంకు), ఎం.మనోజ్ (756), డి.అఖిల్(1,719), బి.బన్ని (2,570), జి.హర్విన్ (3,084), బి.ప్రవీణ్ (3,912), సీహెచ్.అభిషేక్ నాయక్ 7,122వ ర్యాంకుతో పాటు మరో ఇరువై మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారిని శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, ఎస్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్వేతార్కుడికి అభిషేకం

కాజీపేట: సంకటహార చతుర్థిని పురస్కరించుకుని కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలో నవధాన్యాలతో శనివారం అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.